క్లుప్తంగా

ఘనంగా కార్తీకరాజు జాతర



మొక్కులు చెల్లించుకుంటున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరంలో సోమవారం కార్తీకరాజు పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతియేటా భోగి పండుగనాడు నిర్వహించుకోవడం ఆయనవాయితీ అని గ్రామస్తులు చెప్పారు. ఈ పండుగా సందర్భంగా పాడిపశువులు ఆయురారోగ్యంగాలతో ఉండాలని మొక్కలు చెల్లించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కనకయ్య, నరసయ్య, యాదయ్య, చంద్రయ్య, యాదగిరి, సమ్మయ్య, గట్టయ్య, రాకేశ్, పరశురాములు, భరత్, సంతోష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



బోరు మోటరును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని అప్పనపల్లి, పెద్దగుండవెల్లి, బల్వంతాపూర్, ఆకారం,గంభీర్‌పూర్ గ్రామాలల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీరోడ్ల నిర్మాణానికి నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ ఉచితంగా కరెంట్, నిరుద్యోగులకు ఉద్యోగాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి, వెంకటస్వామిగౌడ్, బాల్‌నర్సయ్య, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, కనకయ్య, ఉస్మాన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యతిరేకించే వారికి బుద్ధి చెబుదాం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చినా కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వ్యతిరేకిస్తున్నారని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు, భాను అన్నారు. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో తలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమ సమీకరణ సమావేశం సోమవారం నంగునూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులతో ర్యాలీ నిర్వహించి జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కనకయ్య, రాజు, రాజయ్య, నర్సింగారావు, రాజు, రాజమౌళి, నరేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల మద్దతుకే జేఏసీ

మర్కుక్(గజ్వేల్): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాదిగ దండోరా జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో తలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మాదిగ ఉపకులాలపై ఉందని మండల మాదిగ జేఏసీ కన్వీనర్ భిక్షపతి, కోకన్వీనర్ నర్సింహులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో సోమవారం జేఏసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల మద్దతు కోసం ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. గ్రామగ్రామాన కమిటీలు నిర్మిస్తామని చెప్పారు కార్యక్రమంలో నాయకులు యాదగిరి, బాలకృష్ణ, కృష్ణమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథం మరణం తీరనిలోటు: ఎమ్మార్పీఎస్

సిద్దిపేటజోన్: మాజీ ఎంపీ మంద జగన్నాథం మరణం మాదిగ జాతికి తీరనిలోటుని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, అంబేడ్కర్ నేషనల్ అవార్డు గ్రహీత గుర్రాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని, మాదిగలకు వర్గీకరణ ఫలాలు అందాలని ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అన్ని రకాలుగా తనవంతు సాయం అందించిన గొప్ప వ్యక్తిగా పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు బెల్దె రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కనులపండువగా కల్యాణం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచారం గుట్టలో గోదా, రంగనాయకుల కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10.30 ని.లకు గర్భగుడి నుంచి శ్రీలక్ష్మీ నృసింహస్వామివారు రంగనాయకులుగా ఈరబాయమ్మ తోటకు వేంచేశారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కల్యాణవేదికపై ఆసీనులయ్యారు. ఆలయ ఈఓ పార్నంది విశ్వనాథశర్మ, మాజీ చైర్మన్ హన్మంతరావు పురప్రముఖుల సమక్షంలో అర్చకులు ఎదుర్కోలు, స్వామివారికి యజ్ఞోపవిత ధారణ, జీలకర బెల్లం, ముత్యాల తలంబ్రాలు, అమ్మవారికి మంగళసూత్ర ధారణ తదితర కల్యాణ తంతు జరిపించారు. వేడుకను తిలకించి భక్తులు తరించారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి-రంగనాయకుల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శేషం మధుసూదనాచారి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జరిగిన వేడుకలలో భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రాజుస్వామి మాట్లాడుతూ నెలరోజులుగా కొనసాగిన గోదాశ్రీవ్రతం సోమవారం ముగిసిందన్నారు. రాంప్రకాశ్, కనకారెడ్డి దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. శేషాచార్యులు, రాజు స్వామి, సాయి, హరీశ్, వినయ్ కల్యాణ తంతు జరిపించారు.

సిర్సనగండ్లలో..

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్లలో రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, కుకునూరుపల్లిలో సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో గోదారంగనాయకస్వామి కల్యాణోత్సవాలు వైభంగా సాగాయి. పూజారులు మిట్టపల్లి రామ్మోహన్, అజయ్ కల్యాణం జరిపించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



బెజ్జంకిలో గోదాదేవి రంగనాయకుల కల్యాణ వేడుక



నాచగిరిలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొండపాక(గజ్వేల్): కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కొండపోచమ్మ జాతరకు అంకురార్పణ

అమ్మవారికి సదరుపటం

జగదేవ్‌పూర్(గజ్వేల్): భోగి పండుగ పర్వదినం సందర్భంగా కొండపోచమ్మ మూడు నెలల జాతరకు సోమవారం సదరు పటంతో అంకురార్పణ చేశారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయాన్ని ముస్తాబు చేశారు. బోనం కుండ, జల్లకడువ, డప్పు చప్పుళ్ల మధ్య తీసుకువచ్చి నైవేద్యం సమర్పించారు. బైండ్లవారు పటంవేసి ఆటపాటలు నిర్వహించారు. ఆలయ ఈఓ రవికుమార్, ఆలయ డైరెక్టర్లు ఆగమల్లు, ఆశయ్య, నరేశ్, వజ్రమ్మ, ఆలయ మాజీ చైర్మన్ హన్మంతరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు భానుప్రకాశ్‌రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అమ్మవారికి సదరుపటంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశామని చెప్పారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు ప్రతి ఆది, సోమ, మంగళవారం జాతర కొనసాగుతుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరి, చందు, లక్ష్మణ్, చిన్న, సుధాకర్, అర్చకులు, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, రాజు, స్వామి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలయంలో సిద్ధంచేసిన సదరుపటం

బీఆర్‌ఎస్ అక్రమాలు బయటపెడతాం

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదేళ్ల అధికారంలో ఉండి సిద్దిపేటలో చేసిన అవినీతి, అక్రమాలను త్వరలోనే బయటకు తీస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించారన్నారు. లక్షల కోట్ల రాష్ట్ర ఖజానాను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయం అన్నారు. రైతుభరోసా అందిస్తుంటే మాజీమంత్రి హరీశ్‌రావు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో కూలీలు, తక్కువ భూమి ఉన్న రైతులు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన తర్వాత రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు మధు, గయాజొద్దీన్, సలీం రాకేశ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రోడ్డు వేసిన వారిపై చర్యలేవి?

మిరుదొడ్డి(దుబ్బాక): ఎలాంటి అనుమతులు లేకుండా తన వ్యవసాయ భూమిలో రోడ్డు వేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అల్వాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ 76, 77 సర్వే నంబర్లలో తనకున్న మూడెకరాల భూమిలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, కనకయ్య రాత్రికి రాత్రే అక్రమంగా రోడ్డు నిర్మించారన్నారు. అధికారపార్టీలో ఉన్నామన్న అహంకారంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని వాపోయారు. తనను సంప్రదించకుండా రోడ్డు వేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్, సీపీ, ఆర్డీఓ, దుబ్బాక సీఐ, మిరుదొడ్డి తహసీల్దార్ అలాగే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్ తదితరులు ఉన్నారు.



రోడ్డును చూపుతున్న మాజీ వైస్ ఎంపీపీ రాజులు

26 నుంచి పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు

నంగునూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం 26 నుంచి కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టనుందని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ తెలిపారు. నంగునూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు మంజూరవుతాయన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసింది గోరంతైతే కొండంతగా గొప్పలు చెప్పారని విమర్శించారు. కార్యక్రమంలో అశోక్, సదానందం, నవీన్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పోలీసు అధికారులు

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటరూరల్/వర్గల్(గజ్వేల్): వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పలుచోట్ల వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గజ్వేల్ రాజీవ్ రహదారిపై పాతూరు కూరగాయల మార్కెట్‌వద్ద నిర్వహించి కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ వెంకట్రామ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు. సిద్దిపేట మండల పరిధిలోని బండచెర్లపల్లిలో ఎస్ఐ అపూర్వరెడ్డి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. వాహనం నడిపే సమయంలో సంబంధిత పత్రాలు, డ్రైవింగ్‌లైసెన్సు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి నగరంతండా వద్ద డ్రైవర్లు, యువకులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.



గజ్వేల్‌రూరల్: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

ఘనంగా భోగి సంబురాలు

సంక్రాంతి మూడురోజుల సంబురాల్లో భాగంగా మొదటి రోజైన భోగి పండుగ వేడుకలు అన్ని మండలాల్లోను సోమవారం ఘనంగా జరిగాయి. ఇంటి ముందు తీరొక్క రంగులతో సంక్రాంతి ముగ్గులు వేశారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అదే విధంగా నాయకులు క్రికెట్ టోర్నీలు ప్రారంభించి గెలుపొందిన జట్లకు ట్రోఫీలు అందజేసి ప్రోత్సహించారు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



మర్కుక్(గజ్వేల్): బహుమతులను అందజేస్తున్న నేతలు



బెజ్జంకి(సిద్దిపేట): గూడెంలో కాటిరేవుల ఎడ్ల జాతర



హుస్నాబాద్‌రూరల్: మహాలింగేశ్వరుడికి అన్నాభిషేకం

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్

దుబ్బాకటౌన్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సంక్షేమ పథకాలు అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ అన్నారు. రాయపోల్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేదలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చిన నియోజకవర్గానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, యువజన నాయకులు హన్మాండ్లు, రాజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫారుక్ హుస్సేన్

వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

దుబ్బాక: సంక్రాంతి వేడుకల్లో ప్రజలు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ గంగరాజు సూచించారు. లచ్చపేటలో మాజీ కో ఆప్షన్ మెంబర్ రఫీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది మహిళలు పాల్గొని తమ ప్రతిభ చూపారు. విజేతలకు ఎస్ఐ బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీటీసీ ఇంగు శోభ, ప్రొబేషనరి ఎస్ఐ కీర్తిరాజు, మధన్‌మోహన్, సంతోష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా దుబ్బాక బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎస్ఐ అవగాహన కల్పించారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ గంగరాజు

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సహాయం అందజేత



హుస్నాబాద్: ఇటీవల పట్టణంలోని ఉప్పర పల్లి ఇస్తారికి చెందిన లాండ్రి దుకాణం విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఇస్తారికి రూ.10వేల నగదును పంపించారు. ఆ నగదును సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య చేతుల మీదుగా సోమవారం ఇస్తారికి అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, పున్న లావణ్య సది తదితరులు ఉన్నారు.

◆ బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



సంజీవులు

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ చేర్యాల మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని చుంచనకోటకు చెందిన వడ్లకొండ సంజీవులు ఎంపికయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన నియామకం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. తనకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జనగామజిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, కేపీఎల్ఎన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మద్దూరు మండలాధ్యక్షుడిగా..

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండలాధ్యక్షుడిగా మండలంలోని గాగిలాపూర్‌కు చెందిన మోకు ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎంపికయ్యారని జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేస్తానని ఉదయ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.



ఉదయ్‌కుమార్‌రెడ్డి

◆ సెల్‌ఫోన్‌ల అందజేత



సిద్దిపేటకమాన్: పలువురు పొగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను నూతన టెక్నాలజీ సాయంతో పోలీసులు గుర్తించి బాధితులకు అందజేశారు. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన అన్నపూర్ణ, సుమన్ నెలరోజుల క్రితం సిద్దిపేటలో తమ సెల్‌ఫోన్‌లను పొగొట్టుకున్నారు. దీంతో వారు ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ యాప్ సాయంతో గుర్తించారు. వాటిని సీఐ బాధితులకు సోమవారం అందజేశారు.

◆ ఆత్మరక్షణకు కరాటే అవసరం



దుబ్బాకటౌన్: ఆత్మరక్షణ కోసం కరాటే అందరికీ అవసరమని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు మాస్టర్ బురాని శ్రీకాంత్ అన్నారు. దుబ్బాకలో సోమవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడింగ్ టెస్ట్‌లో దుబ్బాక మండలం నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది విజేతలుగా నిలిచి సర్టిఫికెట్స్, బెల్టులు సొంతం చేసుకున్నారన్నారు. మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సూచించారు.

◆ కలప తరలిస్తున్న వారికి జరిమానా

రామాయంపేట(మెదక్): కలపను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించినట్లు అటవీశాఖ రేంజ్‌అధికారి విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం రాత్రి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా కలపను తరలిస్తున్నట్లు సమాచారం రాగా.. దాడిచేసి వాటిని స్వాధీనం చేసుకొన్నామని చెప్పారు. యూకలిప్టస్ కలప రవాణాకు ముందస్తుగా సంబంధిత రైతుల అంగీకారపత్రం డ్రైవర్ల వెంట ఉంచుకోవాలని చెప్పారు. అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.